# ముమ్మరంగా దరఖాస్తుల స్వీకరణ



కిస్మత్‌పూర్‌లో ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, డిసెంబర్ 30: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. కిస్మత్‌పూర్ గ్రామలో ప్రజా పాలన కేంద్రాన్ని పరిశీలించి.. మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఇచ్చేందుకు చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, సంగారెడ్డి నాయకులు సురేశ్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

***కౌంటర్ల వద్ద తగ్గిన రద్దీ..***

సైదాబాద్, డిసెంబర్ 30: మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గంలో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారం ప్రశాంతంగా కొనసాగింది. యాకుత్‌పురా నియోజకర్గంలోని పలు కౌంటర్లను ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సందర్శించి జీహెచ్‌ఎంసీ అధికారులకు తగు సూచనలు చేశారు. ఆస్తిపన్నుల విభాగం ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యూల్ పలు ప్రాంతాల్లో పర్యటించారు.

***ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి***

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 30: దరఖాస్తుల స్వీకరణలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సుల్తాన్‌పల్లి గ్రామ సర్పంచ్ దండుఇస్తారి అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ సంగీత, ఎంపీవో ఉషా, వ్యవసాయ విస్తరణ అధికారి రాఘవేందర్, ఉప సర్పంచ్ స్పందనగౌడ్, వార్డు సభ్యులు చంద్రశేఖర్, మాల కృష్ణ, విరచారి, సత్యమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

***మూడోరోజు కొనసాగిన ప్రజాపాలన దరఖాస్తులు***

మణికొండ, డిసెంబర్ 30: నార్సింగి మున్సిపల్ పరిధిలోని ప్రజా పాలన కేంద్రాలను నార్సింగి మున్సిపల్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు పర్యటించి ప్రజా పాలన నిర్వహణపై కమిషనర్ సురేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఫల్గుణ్‌కుమార్ ఆయా వార్డుల వద్ద ఏర్పాట్లు, కొనసాగుతున్న పని తీరును సమీక్షించారు.

***బాబుల్‌రెడ్డినగర్‌లో..***

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 30: ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దరఖాస్తులు స్వీకరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ రవికిరణ్ సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లోని దరఖాస్తులు స్వీకరిస్తున్న కేంద్రాలను పరిశీలించారు.

## హిట్ అండ్ రన్ కేసులో నిందితుడి అరెస్ట్

చాదర్‌ఘాట్, డిసెంబర్ 30: హిట్ అండ్ రన్ కేసులో ఓ యువకుడి మృతికి కారణమైన వాహనాన్ని పోలీసులు కనుగొన్నారు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి యువకుడి మృతికి కారణమైన వ్యక్తిని కూడా చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పల్టన్ ప్రాంతానికి చెందిన శ్రవణ్‌కుమార్(24) ను ఈ నెల 6న మలక్‌పేట యశోద ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలకు గురై ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ ఈ నెల 9న మృతి చెందాడు. ఈ కేసులో పోలీసులు బృందాలుగా ఏర్పడి వాహనాన్ని కనుగొనేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనకు సంబంధించి సీసీ పుటేజ్‌లో రికార్డ్ అయిన దృశ్యాల ఆధారంగా వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నాగోల్ బండ్లగూడ ప్రాంతానికి చెందిన సూర్యప్రకాశ్‌రెడ్డి తన స్నేహితులతో కలిసి తన కారులో వెళ్తుండగా మలక్‌పేట యశోద్ దవాఖాన వద్ద రోడ్డు దాటుతున్న శ్రవణ్‌కుమార్ ను ఢీకొట్టి అక్కడ నుంచి పరారయ్యాడు. ప్రమాదంలో కారు అద్దాలు పగిలిపోవడంతో పాటు ముందు భాగం దెబ్బతిన్నది. మరుసటి రోజు కారుకు మరమ్మతులు చేయించాడు. దీంతో వాహనం నంబర్ ప్లేట్ సరిగా కనిపించకపోవడంతో వాహనాన్ని ట్రేస్ చేయడం పోలీసులకు కష్టంగా మారింది. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఎట్టకేలకు ప్రమాదానికి కారణమైన సూర్యప్రకాశ్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

## యూపీ కేంద్రంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

బండ్లగూడ, డిసెంబర్ 30: యూపీలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా శంషాబాద్ ఎక్సైజ్ శాఖ పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. యూపీకి చెందిన అజయ్‌పటేల్, బీహార్‌కు చెందిన అనిల్, హర్యానాకు చెందిన ఖలీల్ ముఠాగా ఏర్పడి... యూపీలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించాలనుకున్నారు. యూపీ నుంచి గంజాయిని తీసుకువస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో గగన్‌పహడ్ వద్ద శనివారం తెల్లవారుజామున 5గంటల సమయంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న ఒక బైకును తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయిని 86 ప్యాకెట్లలో బైకుపై తరలిస్తుండగా పోలీసులు ముగ్గురిని పట్టుకున్నారు. వారి నుంచి 70వేల నగదు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

### గంజాయి విక్రయిస్తున్న విద్యార్థులు అరెస్ట్

ఎల్బీనగర్, డిసెంబర్ 30: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు విద్యార్థులను ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు కిలోల ఎండు గంజాయి, 400 గ్రాముల వదులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన దండ ఉదయ్‌రెడ్డి (21) ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. అదే హాస్టల్‌లో ఉంటున్న యాదరి శివశంకర్ (21), హుడా కాంప్లెక్స్‌కు చెందిన బిటెక్ చదువుతున్న చర్లపల్లి భార్గవ్ గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం రావడంతో వీరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. ఆంధ్రప్రదేశ్ సీలేరు నుంచి గంజాయి తెప్పించి దిల్‌సుఖ్‌నగర్‌లో విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి రెండు కిలోల ఎండు గంజాయి, 400గ్రాముల వదులు గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు సీజ్ చేసి సరూర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.



ఆదిత్య టాలెంట్ హై స్కూల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 30: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. కాటేదాన్ వెంకటేశ్వర కాలనీలోని ఆదిత్య టాలెంట్ హై స్కూల్‌ను శనివారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ వి.నిరంజన్, కరస్పాండెంట్ ఎస్.ఎస్.జయప్రకాశ్, డైరెక్టర్ పి.సూర్యనారాయణ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌కు స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆదిత్య టాలెంట్ హై స్కూల్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంధ విద్యార్థులకు టాకింగ్ వాచ్‌లు అందజేత



సైదాబాద్, డిసెంబర్ 30: దారుషిఫా అంధ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు హుందై కంపెనీ ప్రతినిధులు టాకింగ్ వాచ్‌లను అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం దారుషిఫా హుందై కంపెనీ హెచ్‌ఆర్‌ఆర్ అశ్విని జన్మదినం సందర్భంగా పాఠశాలలోని 80 మంది అంధ విద్యార్థులకు టాకింగ్ వాచ్‌లను అందజేశారు. విద్యార్థులకు టాకింగ్ గడియారాలను సరిగా ఉపయోగించుకోవాలని, బాగా చదువుకోవాలని, జాగ్రత్తగా భద్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు సునంద, సద్గుణ, జావేద్, రామాదేవి, రవీందర్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

బండ్లగూడ, డిసెంబర్ 30: ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌గూడ గ్రామంలో నివసించే రవి భార్య కవిత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా శనివారం సాయంత్రం ఇద్దరు చిన్నారులకు అన్నంలో క్రిమిసంహారక మందులు కలిపి తినిపించడంతో పాటు ఆమె కూడా తిన్నది. ఈ ఘటన తన భర్త రవికి వీడియో కాల్ ద్వారా చూపించింది. కంగారు పడిన భర్త రవి స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇంట్లోకి ప్రవేశించి ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉంది.

## సమయ పాలన పాటించకుంటే చర్యలు

● డీసీపీ బిరుదురాజు రోహిత్ రాజ్

*సైదాబాద్, డిసెంబర్ 30: ప్రభుత్వ ఆదేశాల మేరకు దుకాణాలు, హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపుల నిర్వాహకులు సమయ పాలన పాటించాలని సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బిరుదురాజు రోహిత్ రాజ్ తెలిపారు. శనివారం సైదాబాద్‌లో సౌత్,ఈస్ట్ జోన్ కార్యాలయంలో జోన్ పరిధిలోని షాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన సమయ వ్యవధిని పాటించి, సకాలంలో తమ సంస్థలను రాత్రివేళల్లో మూసివేయాలన్నారు. అదే విధంగా తమ సంస్థల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సక్రమంగా ఉండేలా చుట్టు పక్కల ప్రాంతాలను కవర్ చేసి, ట్రాఫిక్ రహితంగా ఉండే విధంగా సీసీ కెమెరాల నిర్వహణ ఉండాలన్నారు. రాత్రివేళల్లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, వారిపై కేసులను నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అదేశించారు. సంతోష్‌నగర్, మలక్‌పేట డివిజన్ల ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.*

## డిసెంబర్ 31న ముమ్మరంగా డ్రంకన్ డ్రైవ్‌లు

● రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ పి. మురళీకృష్ణ

*బండ్లగూడ, డిసెంబర్ 30: నూతన సంవత్సర స్వాగత వేడుకల్లో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ పి. మురళీకృష్ణ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని ఆయన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31వ తేదీన వేడుకలకు సంబంధించి ప్రజలు పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్‌లు సోమవారం ఉదయం 6గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. నిబంధనల అతిక్రమించిన వారికి పదివేల రూపాయల జరిమానాలను విధించడం జరుగుతుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్ హిమాయత్ సాగర్ టోల్‌ప్లాజాను మూసివేయనున్నట్లు తెలిపారు. అత్తాపూర్, ఆరాంఘర్, దుర్గానగర్, అజీజ్‌నగర్, తదితర ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్‌లను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ తదితరులు ఉన్నారు.*

## శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలి

● నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్

మణికొండ, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలని.. పోలీసులు సూచించిన నిబంధనలు పాటించాలని నార్సింగి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నార్సింగి, గండిపేట, కోకాపేట, హిమాయత్‌సాగర్ తదితర ప్రాంతాల్లో క్లబ్‌లు, రిసార్టుల్లో నిబంధనలకు లోబడి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. డిసెంబర్ 31 రాత్రి 7 గంటల నుంచి నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్, రాయల్ ఫంక్షన్‌హాల్ జంక్షన్, శంకర్‌పల్లి ఎక్స్‌రోడ్ ప్రాంతాల్లో పోలీసులు గండిపేటకు వెళ్లే ప్రాంతాల్లో ట్రాఫిక్ అంక్షలు ఉన్నాయని.. ముందస్తుగా చేరుకోవాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బ్రిడ్జి నిర్మాణంపై గ్రేటర్ కమిషనర్‌కు ఫిర్యాదు

సైదాబాద్, డిసెంబర్ 30: సైదాబాద్‌లో కొనసాగుతున్న ఎస్‌ఆర్‌డీపీ బ్రిడ్జి నిర్మాణ పనుల అవకతవలపై విచారణ జరిపించాలని, బహుళ అంతస్తుల భవనాన్ని కాపాడేందుకు బ్రిడ్జి నిర్మాణ ప్లాన్‌ను హనుమాన్ దేవాయంపై నుంచి వెళ్లే విధంగా మార్చారంటూ శనివారం జీహెచ్ ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఆర్‌డీపీ నిధులతో చేపట్టిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిపి వేయాలని, సైదాబాద్‌లో పర్యటించి పూర్తి నివేదిక ఇవ్వాలని ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్‌కు గ్రేటర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని మాజీ నగర డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ కె.సహదేవ్‌యాదవ్, కొత్తకాపు రవీందర్ రెడ్డి, వినయ్‌కిశోర్, శ్రీకాంత్ రెడ్డి, మహేశ్, శ్రీనాథ్, వినోద్ తెలిపారు.

## పంచవటి కాలనీకి చేరుకున్న అయోధ్య అక్షితలు

*మణికొండ, డిసెంబర్ 30: అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర దేవత అక్షింతలను ఇంటింటికీ పంచే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామాలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఎంతో ఘన కీర్తి కలిగిన అయోధ్య రామమందిరంలో జనవరి 22న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర దేవత అక్షితలు శనివారం మణికొండ మున్సిపాలిటీకి చేరుకున్నాయి. సాయంత్రం పంచవటి కాలనీ మీదుగా పవిత్ర దేవతా అక్షితలు, కలిశాలకు మేళతాళాలతో పూర్ణకుంభ స్వాగతం ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. దేవతా అక్షితల కలిశాలతో ఊరేగింపుగా, కోలాటాలతో పంచవటి కాలనీలో వెలిసిన సీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకొని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.*